ప్రజాశక్తి
బుధవారం 27 మార్చి 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం..

- 887 రౌడీ షీటర్లు బైండోవర్
- 18 చెక్‌పోస్టులలో నిరంతర తనిఖీలు
- నియమావళి అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు
- ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు సార్వత్రిక ఎన్నికలపై తీసుకున్న చర్యలను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దష్టిలో ఉంచుకొని జిల్లా పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉందన్నారు. ఇందులో భాగంగా గత ఎన్నికల కేసులలో నిందితులుగా ఉన్న వారందరినీ బైండోవర్ చేశామన్నారు. 426 మందిని ఇప్పటికే బైండోవర్ చేశామని, మిగిలిన వారిని కూడా త్వరితగతిన బైండోవర్ చేయాలని జిల్లాలోని పోలీస్ అధికారులను ఆదేశించామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో 1031 రౌడీ షీటర్ల 887 మందిని సెక్యూరిటీ సెక్షన్లలో బైండోవర్ చేయగా, మిగిలిన 144 మంది రౌడీ షీటర్లపై బైండోవర్ ప్రక్రియను త్వరితగతిన పోలీస్ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు.

చెడు నడత కలిగిన వ్యక్తులు/ రౌడీషీటర్లను బైండోవర్ చేయడంతో పాటు వారి కదలికపై నిరంతర నిఘా ఉంచామన్నారు. ఇతర జిల్లాల నుండి ఎవరైనా కొత్త/ అనుమానాస్పద/ రౌడీ షీటర్లు జిల్లాలోకి వస్తే ఆయా జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని వారిపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచామన్నారు. బైండోవర్ ▶ 2లో

రాజకీయ చక్రబంధంలో 'శిద్దా'

- చంద్రబాబుతో టచ్‌లో ఉన్నారనే ప్రచారంతో వైసిపి అప్రమత్తం
- సిఎంఒ నుంచి పిలుపు..
- సిఎం జగన్‌తో శిద్దా, ఆయన తనయుడు భేటీ
- దర్శిలో పోటీ వద్దంటూ తమదైన శైలిలో హితవు!



సిఎం జగన్‌తో శిద్దా రాఘవరావు, సుధీర్ (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తన కుమారుడితో కలిసి మంగళవారం నాడు సిఎం జగన్‌తో భేటీ అయ్యారు. కొద్ది రోజులు గా శిద్దాపై సాగుతున్న రాజకీయ ఊహాగానా లకు తెరదించేందుకు ఈ భేటీ జరిగింది. సిఎం జగన్ ఏమి చెప్పారన్నది రహస్యంగా ఉన్నప్ప టికీ చర్చల సారాంశం ఏమిటో రాజకీయ వర్గాల్లో స్పష్టంగానే చర్చ సాగుతోంది. శిద్దా రాజకీయ ఆలోచనలకు బ్రేక్ పడ్డట్లు వైసిపి వర్గాలు భావిస్తున్నాయి.

దర్శిలో తెలుగుదేశం నుంచి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పోటీ చేయడానికి సన్నాహాల్లో ఉన్నారనే ప్రచారం కొద్దిరోజులుగా సాగుతోంది. అంతేకాకుండా తెలుగుదేశం అధినేత చంద్రబాబుతోనే నేరుగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు టచ్‌లో ఉన్నారనే చర్చ కూడా నడుస్తోంది. తెలుగుదేశం నుంచి దర్శిలో పోటీ చేయించేందుకు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రయత్నాలు కూడా ఉన్నాయని తెలుసుకున్న వైసిపి జిల్లా కీలక నేతలు అప్రమత్తమయ్యారు. శిద్దాకు బ్రేక్ వేసేందుకు రంగం సిద్ధం చేశారు. సిఎంఒ నుంచి మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు పిలుపువచ్చింది. అందుకు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్వయంగా చక్రం తిప్పారు. హుటాహుటిన మంగళవారం సాయంత్రం తాడేపల్లికి మాజీమంత్రి శిద్దా రాఘవరావుతో పాటు ఆయన తనయుడు సుధీర్ కూడా వెళ్లారు. సిఎం జగన్‌తో భేటీ అయ్యారు. సిఎంఒలోనే అంతా నడిచింది. దర్శిలో పోటీ చేయకుండా శిద్దాకు తమదైన శైలిలోనే సిఎం జగన్ హెచ్చరికలు చేసినట్లు వైసిపి వర్గాల్లో చర్చ సాగుతోంది. సిఎం జగన్‌ను కాదనిపోతే పరిస్థితులు ఎలా ఉంటాయో కూడా జిల్లా నేతలు ఇప్పటికే శిద్దాకు ఒకరిద్దరు గట్టిగానే చెబుతున్నారని చర్చ సాగుతోంది. ఒకరకంగా చెప్పాలంటే పార్టీ వీడకుండా ఉంచేందుకు భయపెడుతున్నారని కూడా భావిస్తున్నారు. ఇప్పుడు సిఎం జగన్ స్వయంగానే ఈ భేటీలో పూర్తిగా చక్రబంధం బిగించారా? ఆయన తెలుగుదేశం వైపు వెళ్లకుండా కట్టడి చేశారా? అనే దానిపై ఉత్కంఠ చర్చ సాగుతోంది. మరోవైపు జిల్లా సీనియర్ నేతలు ఇద్దరూ కూడా శిద్దాకు గట్టిగానే చెప్పినట్లు సమాచారం. అధికారం మారితే ఇబ్బంది లేదని.. మారకుంటే మళ్లీ జగన్ సిఎం అయ్యాక నీ పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలని జిల్లా కీలక నేతలు ఇద్దరు మాజీ మంత్రి శిద్దాకు సూచించారని సమాచారం. వ్యాపారపరంగా ఇబ్బందులు మళ్లీ ఎదురవుతాయని కూడా చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆయన తర్జనభర్జనలు పడుతూనే దర్శి విషయంలో అటు చంద్రబాబుకూ ఏ విషయం చెప్పలేదు. నాలుగురోజుల క్రితం అన్ని వైపులా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనకు వచ్చారు. తెలుగుదేశం ▶ 2లో

8న సాగర్ నీరు విడుదల

- వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా సమగ్ర ప్రణాళిక రూపొందించాలి
- కలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి అవసరాల కోసం ఏప్రియల్ 8వ తేదీన సాగర్ నీరు విడుదల కానుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. విడుదలయ్యే నీటితో బాపట్ల జిల్లాలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులన్నింటిని నింపాలన్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జల వనరులు, ప్రజల అవసరాలు, వాటి వినియోగంపై అనుబంధ శాఖల అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నీటి కొరత ఉన్నందున నీటి చౌర్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సాగర్ కాల్వలకు నీరు విడుదలయ్యేలోగా అత్యవసరమైన మరమ్మత్తులు, లీక్‌ల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రక్షిత మంచినీటి పథకాల పనులు శరవేగంగా ముగించాలన్నారు. నాగార్జున సాగర్ కాల్వల కింద ఉన్న 131సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపడానికి 0.443 టీఎంసీల నీరు విడుదల కానుందన్నారు. కష్ణ పశ్చిమ డెల్టా కింద ఉన్న 52 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపడానికి 0.16 టిఎంసిల నీరు విడుదలవుతుందన్నారు. అలాగే గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాలలోని చెరువులు నింపడానికి 0.05 టిఎంసిల నీరు వస్తుందన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తొలగించడానికి క్షేత్రస్థాయిలో మరింత పక్కాగా ప్రణాళిక రూపొందించి నివేదిక అందించాలన్నారు.

జలవనరులు అందుబాటులో లేని గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీరు అందించే ఏర్పాట్లు అధికారులు చేపట్టాలని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. ప్రస్తుతం 153 చేతిపంపులు చెడిపోయాయని వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు లేని గ్రామాలలో బోర్లు వేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయితీ నిధులు వినియోగించాలన్నారు. చెడిపోయిన బోర్లను సైతం మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొల్లూరు మండలంలోనే పది మీటర్ల మేర భూగర్భ జలాలు అడుగంటాయని చెప్పారు. బోర్లు వేయడానికి అవకాశాలు లేని ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీరు తరలించడంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు రవాణా చేసే వాహనాలకు జిపిఎస్ యాప్ అనుసంధానిస్తామని తెలిపారు. జిల్లాస్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ ఉంటారన్నారు. 750 బ్లాక్‌లుగా గుర్తించి పూర్తిస్థాయి పర్యవేక్షణ కోసం మండల, పంచాయతీ స్థాయిలో కమిటీలు వేస్తున్నట్లు వివరించారు.

మండలాల వారీగా నీటి లభ్యత, రానున్న అవసరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం వేమూరు నియోజకవర్గంలో 159 గ్రామాలు ఉండగా, 12 గ్రామాలు రక్షిత నీటి ▶ 2లో

వైసిపికి 'పెద్దిరెడ్డి' రాజీనామా



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి నాయకుడు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి ఆ పార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. మార్కాపురం టిక్కెట్ ఆశించిన ఆయన అప్పట్లో మార్కాపురం జిల్లా ఏర్పాటు కోసం జరిగిన పోరాటాల్లోనూ పాల్గొన్నారు. మార్కాపురం ప్రాంతంలో భూకబ్జాలపైనా, ఎమ్మెల్యే అవినీతిపైనా గళం విప్పినా పార్టీలో తగిన గుర్తింపు, ప్రాధాన్యతలు లేనందునే వైసిపికి రాజీనామా చేసినట్లు పెద్దిరెడ్డి తెలిపారు. త్వరలోనే భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామన్నారు.

కలుషిత ఆహారం తిని..!

- 9 మంది గ్రామస్తులకు అస్వస్థత
- తూర్పు పిన్నిబోయినవారిపాలెంలో వైద్యశిబిరం..



గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరం

ప్రజాశక్తి-బాపట్ల

కలుషిత ఆహారం తిని.. మండలంలోని తూర్పు పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో పలువురు ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. గత మూడు రోజులుగా వాంతులు, విరేచనాలతో తొమ్మిది మంది ఇబ్బందులు పడ్డారు. ఓ వృద్ధురాలు బాపట్ల ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. మరొకరు గుంటూరు వైద్యశాలకు వెళ్లారు. మరో ఏడుగురు చికిత్స పొంది.. ఇంటికి వెళ్లారు. కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే విరేచనాలు, వాంతులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వైద్యులు తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వైద్య శాఖ అధికారులు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామస్తులు అస్వస్థతకు గురవటానికి కల్తీ ఆహారమే కారణమని అప్పికట్ల ప్రాథమిక వైద్యానికి కేంద్రం వైద్యులు ఉస్మాన్ తెలిపారు.

తాగునీరు, ఆహార నమూనాలను గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా పరీక్షకు పంపినట్లు ఈవోపిఆర్‌డి పులి శరత్‌బాబు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలు అధికంగా బోరు నీరు ▶ 2లో

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

షరతులను ఉల్లంఘిస్తే ఐపిసి సెక్షన్ల ప్రకారం వారిపై పోలీసులు తీసుకునే చర్యలపై రౌడీ షీటర్లందరికీ క్షుణ్ణంగా వివరించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు.

జిల్లాలో 18 చెక్‌పోస్టుల ఏర్పాటు

జిల్లాలోని ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్లు, ప్రధాన జంక్షన్లలో 18 ముఖ్యమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్టులు బాధ్యతాయుతమైన ఇంచార్జ్‌ల పర్యవేక్షణలో తగినంత మంది సిబ్బందితో అక్రమ మద్యం, నగదు, మాదక ద్రవ్యాలు, విలువైన లోహాలు, ఉచిత పంపిణీ సామాగ్రి వంటి వాటిపై నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు రూ.1,79,95,000 నగదు, 214 గ్రాముల బంగారం, 1872 లీటర్ల అక్రమ మద్యం, 80.3 గ్రాముల మాదకద్రవ్యాలతో పాటు 40 కేజీల పాంగోలిన్ జంతువుకు చెందిన పొలుసులు (హాంక్స్ వంటి జంతువుల ఉత్పత్తి వంటివి) వాహన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నామన్నారు.

సాయుధ బలగాలతో కవాతు

జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సజావుగా ఎన్నికల నిర్వహణకు భరోసా కల్పిస్తున్నామన్నారు. ప్రజలలో పూర్తిస్థాయిలో నమ్మకాన్ని ఏర్పరచడంలో భాగంగా కేంద్ర సాయుధ పోలీస్ బలగాలతో (సిఏపిఎఫ్) సమస్యాత్మక/అతి సమస్యాత్మక గ్రామాల్లో కవాతు చేస్తున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సందర్శించడం, గ్రామాల్లోని ప్రజానీకంతో మమేకమై అక్కడ నెలకొన్న తాజా పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీసులు ఇతర శాఖల అధికారులతో సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎలాంటి గొడవలు, అల్లర్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని ఎస్‌పి తెలియజేశారు. అన్ని రాజకీయపార్టీలు ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించటానికి సంబంధిత శాఖల ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

ఎంసిసి అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

ఎన్నికల నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ని అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలన్నారు. ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సి-విజిల్ యాప్ ద్వారా, (లేదా) పోలీస్ డయల్ 112 ద్వారా, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్‌పి ప్రజలకు సూచించారు.

రాజకీయ చక్రబంధంలో 'శిద్దా'.!

(మొదటిపేజీ తరువాయి)

నుంచీ దర్శి టిక్కెట్టు ఎవరికి ఇవ్వకుండా నిలిపేశారు. శిద్దా రాఘవరావు కోసమేనన్న చర్చ పార్టీ నేతల్లోనూ సాగుతోంది. జిల్లా తెలుగుదేశం నేతలు కూడా దర్శి టిక్కెట్టు శిద్దాకే ఇస్తున్నట్లు గమనించారు. అంతా తమ నేత చంద్రబాబు నిర్ణయం అంటూ దాని వ్యవహారం వదిలేశారు. మరోవైపు అక్కడ వైసిపి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రచారంలోకి దిగిపోయారు. ఒక దశ ప్రచారం కూడా ముగించారు. చర్చలు, భేటీలు, సమావేశాలతో ఆయన ఊపుగా ఉన్నారు. అక్కడ పరిస్థితి ఆయనకు అనుకూలంగా మారిందనే చర్చ కూడా నడుస్తోంది. ఈ తరుణంలో దర్శిలో మాజీ మంత్రి శిద్దా రంగంలోకి దిగితే నష్టంగా భావించిన వైసిపి నేతలు అప్రమత్తమయ్యారు. వెంటనే సిఎంఓ నుంచి రంగంలోకి దిగారు. జరపాల్సిన తతంగాన్ని అంతా అక్కడ నుంచే చూశారు. ఇప్పుడు సిఎం జగన్‌తోనే కలిసి వచ్చాక శిద్దా రాఘవరావు పార్టీ మారే ఆలోచన చేస్తారా? అంటే చర్చ మాత్రం మరోలా ఉంది. జగన్ మాట కాదని రావడం కష్టమనే చర్చ సాగుతోంది. ఒకవేళ పార్టీ వీడదలుచుకుంటే ధైర్యంగా ఏది ఎదురైనా ఎదుర్కొనేలా నిర్ణయం తీసుకోవాలే తప్ప ఇలా వెనుకాముందూ ఆలోచించడం తర్జనభర్జనల వల్ల ఉపయోగం లేదనే చర్చ ఇటు దర్శి నియోజకవర్గ తెలుగుదేశం నేతల్లో నడుస్తోంది. సిఎం జగన్‌తో భేటీ అయ్యాక మాజీ మంత్రి శిద్దా దర్శిలో పోటీ ఆలోచన విరమించుకున్నట్లేనని వైసిపి నేతలు భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో దర్శి అభ్యర్థిపై చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకుంటారనేదీ చూడాలి. ఏదేమైనా మాజీ మంత్రికి ఎటూ కదలకుండా రాజకీయ చక్రబంధం సిఎం జగన్ వేశారన్నది సుస్పష్టం.

8న సాగర్ నీరు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

పథకంపై ఆధారపడ్డాయని మిగిలిన వాటికి బోర్లు, ఫిల్టర్ బెడ్ల ద్వారా నీరు అందుతుందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో 133 గ్రామాలు ఉంటే 93 గ్రామాలు బోర్ల పైన ఆధారపడ్డాయని వివరించారు. అద్దంకి నియోజ కవర్గంలోని 101 గ్రామ పంచాయితీల్లోని ప్రజలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, బోర్ల ద్వారా నీరందుతుంద న్నారు. పర్చూరులో 143 గ్రామపంచాయతీలలో 83 ట్యాంకులు ఉండగా మిగిలిన వాటికి సాగర్, పంట కాల్వల ద్వారా నీరు వస్తుందన్నారు. చీరాలలో 63 గ్రామాలు ఉండగా ఒక గ్రామానికి నీటి సమస్య ఉందని, మిగిలిన వాటికి చెరువులు కాలువల ద్వారా నీరందుతుందన్నారు. చీరాల పట్టణానికి మూడు నెలల వరకు నీటి సమస్య లేదన్నారు. రేపల్లెలో గ్రామాలన్నీ కాల్వలపైనే ఆధారపడినట్లు వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారం తిని.!

(మొదటిపేజీ తరువాయి)

తాగుతున్నారని, వాటిని పరీక్షకు పంపగా.. నీటిలో ఎటువంటి సమస్య లేదని తేలిందన్నారు. ఇతర ప్రాంతాల నుండి మినరల్ వాటర్ వస్తుందని, వాటిని కూడా పరీక్షకు పంపినట్లు వివరించారు. ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యశాఖ, పంచాయతీ ఆధ్వర్యంలో సంయుక్తంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు తెలిపారు. జిల్లా మలేరియా అధికారి వై.రాజ్‌కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సువర్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి స్టాలిన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వాణి సుమన్విత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు బాల్యవివాహాల నిరోధంపై కళాజాతా

ప్రజాశక్తి-సంతమాగులూరు

బాల్యవివాహాల నిరోధకంపై అవగాహన కోసం సంతమాగులూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కళాజాత కార్యక్రమాలు బుధవారం జరుగుతాయని సిడిపిఓ డి సుధ తెలిపారు. సంతమాగులూరు మండలంలో గురిజేపల్లి, సంతమాగులూరు, ఏల్చూరు గ్రామాలలో కళాజాతాలు జరుగుతాయన్నారు. అలాగే బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి, పి మల్లాయపాలెం, బల్లికురవ గ్రామాలలో కళాజాతా నిర్వహిస్తారన్నారు. ప్రజలు పాల్గొనాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ అమర్నాథ్

బిసి డిక్లరేషన్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-చీరాల

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం క్లస్టర్ 6 బీసీ డిక్లరేషన్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమనకు ముఖ్య అతిథులుగా యువ నాయకులు గౌరీ అమర్నాథ్ పాల్గొన్నారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి గుమ్మ వెంకటేష్ ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్‌లో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బీసీలకు 50 సంవత్సరాలకే రూ.4 వేల పెన్షన్, ప్రత్యేక రక్షణ చట్టం, బీసీ సబ్ ప్లాన్ ద్వారా 5 ఏళ్లలో లక్షన్నర కోట్లు ఖర్చు, స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు 33 శాతానికి కేంద్రంతో తీర్మానం, తక్కువ జనాభాతో ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు కార్పొరేషన్ సభ్యులుగా అవకాశం పలు విషయాలను గుర్చి వివరించారు. చంద్రన్న బీమా రూ.10 లక్షలకు పునరుద్ధరణ, పెళ్లి కానుకలు లక్ష రూపాయలకు పెంపు, విద్యా పథకాలు అన్ని పునరుద్ధరిస్తారని అన్నారు. బీసీ డిక్లరేషన్‌లో ప్రవేశపెట్టిన అన్ని పథకాలూ ఇంటింటికీ చేరాలంటే రాష్టంలో చంద్రబాబును, నియోజకవర్గంలో కొండయ్యను గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో బాపట్ల బీసీ సెల్ అధ్యక్షులు కౌతరపు జనార్ధన్, చీరాల పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, చీరాల బీసీ మండల అధ్యక్షులు అంగిరేకుల వెంకటేశ్వరరావు, యూనిట్ ఇన్‌ఛార్జి, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

పోతుల సునీత దంపతులను కలిసిన కరణం వెంకటేష్

ప్రజాశక్తి-చీరాల

వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, సురేష్ దంపతులను కొత్తపేటలోని వారి స్వగృహంలో మంగళవారం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పలువురు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు ఉన్నారు. అదే విధంగా స్థానిక 26వ వార్డు సెవెంత్ డే అడ్వెంటిస్ట్ సంఘం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌ను కలిసి వారికి మద్దతు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌కెపి మేనేజర్ సుబ్బారావు, పిడతల అభిషేక్, మాజీ కౌన్సిలర్ గూడూరి జేమ్స్, జడ మోషే, వంగవరపు పోలయ్య, ఎర్రగుంట్ల దేవయ్య, జడ రవి, మైలవరపు కిషోర్, పిడతల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాం

ప్రజాశక్తి-రేపల్లె

జై భీమ్ రావు భారత్ పార్టీ అధినేత జడ శ్రావణ్ కుమార్ ఈ రాష్ట్రంలో ఉన్న సామాన్య ప్రజల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా, మాజీ న్యాయమూర్తిగా పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో మహనీయుల పేరిట పొందుపరచిన దశ దీవెనలతో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు దోవా రమేష్ రాంజీ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అధికారం చేపట్టిన తర్వాత అమలు చేయకుండా తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. జై భీమ్ రావ్ భారత్ పార్టీ మాత్రం అధికారంలోకి వస్తే ఖచ్చితంగా ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేసి తీరుతుందన్నారు. పూలే యువకెరటం ద్వారా నిరుద్యోగులకు రూ.25 కోట్ల వరకు రుణమిచ్చి పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తామని, ఉపాధి లభించని నిరుద్యోగులకు నెలకు పదివేల నిరుద్యోగ భృతిని కల్పిస్తామని అన్నారు. తమ పార్టీకి ప్రజలందరూ మద్దతుగా నిలబడి కోటు గుర్తుపై ఓటు వేసి అధికారాన్ని అప్పగించవలసిన ఆవశ్యకత రాష్ట్ర ప్రజలకు ఉందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతార్లంక శివ వెంకటేశ్వరరావు, రేపల్లె మండల కన్వీనర్ కర్ర బాబురావు పాల్గొన్నారు.

బిజ్జం శ్రీనివాసరెడ్డి కేసు విషయంలో

రాజకీయ ప్రమేయం లేదు : సిఐ

ప్రజాశక్తి-దర్శి

ముండ్లమూరు మండలం పశువుగల్లు గ్రామానికి చెందిన బెజ్జం శ్రీనివాస్ రెడ్డిపై జరిగిన దాడి విషయంలో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని సిఐ షేక్ షమీఉల్లా తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 11న బెజ్జం శ్రీనివాస్ రెడ్డి తన ట్రాక్టర్ తప్పెట్ల నాగభూషణం అనే వ్యక్తికి ట్రాక్టర్ తగిలింది. దీంతో ఆయన కాలు విరిగింది. ఉల్లగల్లు గ్రామ పెద్దలు కాలు విరిగినందున నాగభూషణం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.50 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. అందులో భాగంగా శ్రీనివాస్ రెడ్డి రూ.60 వేలు అప్పుడే నాగభూషణంకు అందజేశాడు. తన బైకును అక్కడ ఉంచి మొత్తం డబ్బులు చెల్లించాల్సిన తర్వాత తీసుకెళ్తానని శ్రీనివాసరెడ్డి తెలిపాడు.



మాట్లాడుతున్న సిఐ షమీఉల్లా

నాగభూషణం ఒంగోలులోని అంజలి హాస్పిటల్ చేరాడు. ఈ క్రమంలో హాస్పిటల్ నుంచి పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చింది. ఆ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేశాడు. దీంతో తనపై కేసు నమోదైనందున మిగతా డబ్బులు తాను ఇవ్వనని శ్రీనివాసరెడ్డి తెలిపాడు. అనంతరం ఈనెల 23న శ్రీనివాసరెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన ఇప్పించాలని పోలీసులను కోరారు. దీంతో బైకును పోలీసు స్టేషన్ వద్ద తీసుకురావాలని నాగభూషణం బంధువులకు ఎస్ఐ సూచించారు. నాగభూషణం బంధువులు బైకు తీసుకురాకుండానే పోలీసు స్టేషన్ వద్దకు వచ్చారు. ఈ క్రమంలో శ్రీనివాసరెడ్డి, నాగభూణం బంధువుల మధ్య మాటా మాటా పెరిగింది. చివరకూ శ్రీనివాసరెడ్డిపై దాడి చేశాడు. శ్రీనివాస్‌రెడ్డి 108 ఫోన్ చేయగా వారు ఆయన్ని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీనివాసరెడ్డి ఒంగోలు రిమ్స్‌కు వెళ్ళాడు. ఇరు గ్రూపులపై తాము కేసు నమోదు చేశామని, ఇందులో ఎంలాటి రాజకీయ ప్రమేయం లేదని ఎస్ఐ తెలిపారు. ఈ కేసు విషయంపై ఓ దినపత్రిక (ప్రజాశక్తి కాదు) లో వచ్చిన కథనం అవాస్తమని ఎస్ఐ ఖండించాడు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించు కోవాలని శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. మండల పరిధిలోని శింగరాయకొండ, మూలగుంటపాడు, పాత శింగరాయ కొండ, సోమరాజు పల్లి, కలికివాయి గ్రామాల్లో బిఎస్ఎఫ్, పోలీసు సిబ్బంది మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకునే విధంగా చూడటమే ఎన్నికల కమిషన్ కర్తవ్యమని తెలిపారు. దానికి అనుగుణంగా అందరూ సహకరించాలన్నారు.ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ టి.శ్రీరామ్, ఎఎస్ఐలు మహబూబ్‌బాషా, ఎస్.ఎ.బేగ్, పోలీసు సిబ్బంది, బిఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



వెలిగండ్లలో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

వెలిగండ్ల : మండల పరిధిలోని పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. కనిగిరి డిఎస్‌పి రామరాజు, పామూరు సిఐ రామ్‌నాయక్, కనిగిరి సిఐ బి.వెంకటేశ్వర్లు, వెలిగండ్ల ఎస్ఐ ఎం.శివ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలిగండ్ల బస్టాండు సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రామరాజు మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పామూరు సిఐ రామ్‌నాయక్ మాట్లాడుతూ రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల ఎస్ఐ శివ, హెడ్‌కానిస్టేబుళ్లు అచ్చిరెడ్డి, శ్రీను, వెంకట్, బాషా, హోంగార్డ్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-మార్కాపురం

వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న షేక్ సుభాని అనే వ్యక్తినిపట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు సిఐ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ వివరాలు వెల్లడించారు. సిఐ కథనం ప్రకారం... మార్కాపురం పట్టణానికి చెందిన షేక్ సుభాని బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల చెడు వ్యసనాలకు బానిసైయ్యాడు. ఈ క్రమంలో సెల్‌ఫోన్లు, బైకులు దొంగిలిస్తున్నాడు. పోలీసు జీపు ఆర్‌టిసి బస్టాండు వద్దకు వెళ్లగా సుభాని పారిపోవడాన్ని పోలీసులు గమనించారు. అనుమానించి వెంబడించి పట్టు కున్నారు. అనంతరం విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. గతంలోనూ మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు ప్పాలడినట్లు తెలిసింది. అప్పట్లో సస్పెక్ట్ షీట్ తెరిచినట్లు చెప్పారు. అయినప్పటకీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. అతనితో పాటు శ్రీనివాస థియేటర్ సమీపంలో నివశిస్తున్న శివ అనే వ్యక్తి కూడా ఈ చోరీల్లో భాగస్వామ్యం ఉన్నట్లు చెప్పారు. అతను పరారీలో ఉన్నారన్నారు. వీరి నుంచి ద్విచక్ర వాహనం కొనుగోలు చేసిన ప్రసాద్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుడు నుంచి రూ. 2.50 లక్షల సొత్తు స్వాధీనం చేసు కున్నట్లు సిఐ తెలిపారు. ఈ సమా వేశంలో మార్కాపురం పట్టణ ఎస్ఐ షేబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు



టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల గ్రామ పంచాయతీ పరిధిలోని శాంతి నగర్‌కు చెందిన పలువురు మంగళవారం టిడిపిలో చేశారు. వాయల ఫిలిప్ ఆధ్వర్యంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సమక్షంలో టిడిపిలో చేశారు. ఎమ్మెల్యే స్వామి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో కొండూరి సురేంద్ర, వాయల జగజ్జీవన్,వాయల ప్రేమ కుమార్, జి.శ్రీను, యన్.మాల్యాద్రి, మార్క్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సైకం చంద్ర శేఖర్, మహీంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజకవర్గంలోని దూదేకులకు మేలు చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే ఆయన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డేనని నియోజకవర్గ దూదేకులు తెలిపారు. దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్.బాజి ,జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు చినకండ్లగుంట సర్పంచి వన్నూరు సాహెబ్ ఆదేశాల మేరకు నియోజక పరిధిలోని దూదేకులు మంగళవారం మంత్రి సురేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ షాదీ తోఫా పథకాన్ని లక్ష రూపాయలు పెంచిన ఘనత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తమ సమస్యలకు పరిష్కారం చూపిన జగన్మోహన్‌రెడ్డి అండగా ఉంటామని ఈ సందర్భంగామంత్రి సురేష్‌కు హామీ ఇచ్చారు. దూదేకుల గామాల్లో సమస్యలను పరిష్కారించాలని కోరారు. ప్రధానంగా ఖబరస్తాన్ సమస్యలను పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టిపాటి బాషా, పలువురు దూదేకులు పాల్గొన్నారు.



మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

చెట్టును ఢీకొన్న బైకు.. యువకుడు మృతి

ప్రజాశక్తి-కురిచేడు



మృతిచెందిన ముజీబ్

బైకు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కురిచేడు మండలం బోధనంపాడు గ్రామ పంచాచతీ పరిధిలోని పెనగమూరు గ్రామం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. కురిచేడు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. దర్శి పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన ముల్లా ముజీబ్ (17) తన స్నేహితులను కలిసేందుకు బైకుపై కురిచేడు వస్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి బైకు అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. దీంతో ముజీబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ముజీబ్ మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-బాపట్ల

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించి తిరిగి ఇంటికి వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన బాపట్ల–పొన్నూరు రహదారి మార్గంలో అప్పికట్ల సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. పొన్నూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన తాడిశెట్టి హరిబాబు(60) బంధువులు బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వైద్యశాలకు వెళ్లి వారిని పరామర్శించి ఆటోలో బాపట్ల నుంచి పొన్నూరు వెళ్తున్నారు. అప్పికట్ల ప్రధాన రహదారి మార్గంలో ఆటో బోల్తా కొట్టింది. దీంతో హరిబాబుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడదిని వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి-పంగులూరు

కొబ్బరి బోండాలతో వెళ్తున్న ఆటో బోల్తా కొట్టిన ఘటనలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పంగులూరు, ముప్పవరం గ్రామాల మధ్య మంగళవారం రాత్రి చోటు చేసుకుంది.



అందినవివరాల ప్రకారం...మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన పాలపర్తి చిన్న, అతని భార్య మహాలక్ష్మి ముప్పవరం నుంచి పంగులూరు వచ్చే రోడ్లో పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డులో పళ్ళ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే వ్యాపారం ముగించుకొని ఆటోలో ఇంటికి బయలుదేరారు. ఆటో ముప్పవరం, పంగులూరు మధ్యలో కోళ్ల ఫారాల వద్దకు వచ్చే సమయంలో అదుపుతప్పి సైడ్ కాలువలో బోల్తా పడింది. దీంతో భార్యా భర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

పొగాకు బ్యారెన్ దగ్ధం

ప్రజాశక్తి-శింగరాయకొండ

క్యూరింగ్ సమయంలో పొగాకు అల్లుడు కర్ర జారీ మొద్దు గొట్టంపై పటడంలో మంటలు చేలరేగిన ఘటనలో పొగాకు బ్యారెన్ దగ్ధమైంది. ఈ ఘటన జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముప్పరాజు మాలి చెందిన పొగాకు బ్యారన్ ఈ ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య సందర్శించారు. బాధిత రైతును పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరగకుండా టీమ్ అధికారులు చర్యలు తీసుకోవాలని బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్ టీమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అధ్యక్షతన పర్చూరు నియోజకవర్గంలోని ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, విఎస్‌టి, వివిటి, ఎటి టీముల అధికారులు, పోలీస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికలు నిర్వహణ కోసం ఎలెక్షన్ కమిషన్ ఈ నెల 16న షెడ్యూల్ ప్రకటించిందని, అప్పటి నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అమలులో ఉందని తెలిపారు. ఆఫీసులు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, ఇలా ప్రతి విషయాలకు అభ్యర్థులు, పార్టీలు పర్మిషన్లు తీసుకొని నిర్వహించుకునేలా చూడాలని కోరారు. ఈ అనుమతులకు సువిధ యాప్ ద్వారా గాని, పర్చూరు ఆర్ఒ ఆఫీసులో గాని అప్లయ్ చేసుకోవచ్చునని తెలిపారు. సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 24 గం లలోనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రతి పార్టీ కూడా తూ.చ తప్పకుండా ఎన్నికల నియమావళి పాటించాలని కోరారు. అందుకు ప్రతి టీమ్ అధికారి నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పర్చూరు ఎఇఆర్ఒ సిహెచ్ సుబ్బయ్య, ఇంకొల్లు ఎఇఆర్ఒ ఎం ప్రమీల, వివిధ టీం అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేత

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

మండలంలోని తాటిపర్తివారిపాలెం ఎడ్యుకేటర్స్ గ్రూపు వారు నిర్వహించు అనేక సేవా కార్యక్రమాలలో భాగంగా కోణికి నలతోటివారిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.42,000 విలువైన బల్లలను అందజేశారు. ఆ గ్రూపు సభ్యులు పంది డేవిడ్, కాకి సాముయేలు, కట్టా సురేష్, చెక్కా సంతోష్ కుమార్, గ్రూపు సభ్యులు విరాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బడి హెచ్ఎం సంజీవరెడ్డి, గౌరవ అతిథులు గంగవరం హైస్కూల్ హెచ్ఎం సమత, పంది సమర్పణ్‌రావు మరియు రిటైర్ హెచ్ఎం ఆత్మకూరి సుబ్బారావు పాల్గొని విద్యార్థులు ఉన్నతంగా చదివి ఇలాంటి సేవా కార్యక్రమాలు ముందుండి నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవరెడ్డి ఫర్నిచర్ బహూకరించిన తాటిపర్తివారిపాలెం ఎడ్యుకేటర్స్ గ్రూపు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-పర్చూరు


రమణి


రేష్మ

పర్చూరు బార్ అసోసియేషన్‌కు 2024-25 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా చుండు రమణి సెక్రటరీగా షేక్ రేష్మ కోశాధికారిగా దగ్గుబాటి రాఘవయ్య చౌదరి కార్యవర్గ సభ్యులు కొల్లా నరేంద్రకుమార్, రావి శ్రీనివాసరావు, వై వెంకటేశ్వరరావు, చాగంటి సుబ్బారావు, కట్టా సాల్మన్, వి తిరుమలరావు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బారసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కొల్లా నరేంద్రకుమార్, రావి శ్రీనివాస రావు నూతన కార్యవర్గానికి తన అభినందనలు తెలిపారు.



సుబ్బారెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు మండలం సుబ్బారెడ్డిపాలెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వేసవిని దృష్టిలో పెట్టుకొని రెండు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ బి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వేసవి 90 రోజుల పాటు చలివేంద్రం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వివరిం చారు. ప్రజలంతా వినియోగించుకోవాలని సురేష్‌కుమార్‌రెడ్డి కోరారు.


కోడ్ కట్టుదిట్టం

రాజకీయ పార్టీలకు అవగాహన కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్



ప్రజాశక్తి-రేపల్లె

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ ఉద్యోగులు పార్టీల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్ హెచ్చరించారు. మంగళవారం ఎన్నికల నియమ నిబంధనలపై రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల తేదీలు ప్రకటించడంతో రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టం చేసామన్నారు. రాజకీయ పార్టీలు అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని కోరారు. అభ్యర్థులు ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఇంటింటి ప్రచారం, ర్యాలీలు మీటింగులు పెట్టుకునేందుకు సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు. పాంప్లెట్లు, బ్యానర్లు, పోస్టర్లు హోర్డింగులు ఏర్పాటు విషయంలో అనుమతులు తీసుకోవాలని తెలిపారు. రాజకీయ పార్టీల మీటింగులతోపాటు రోడ్లపై పెట్టే సభలు సమావేశాలకు అనుమతులు తప్పనిసరి అన్నారు. వాలంటరీలు ఎన్నికల విధులు దూరంగా ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా ఒక రాజకీయ పార్టీ వైపు ప్రచారంలో పాల్గొన్న, పాంప్లెట్లు పంచిన, ఇంటింటి ప్రచారం నిర్వహించిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే నియోజకవర్గంలోని చెరుకుపల్లిలో ముగ్గురు వాలంటీర్లను నిజాంపట్నం మండలంలో ఒక వాలంటీర్ను విధుల నుంచి తొలగించామన్నారు. వాలంటీర్లు ఆన్‌లైన్‌లో గ్రూపులను ఏర్పాటు చేసి రాజకీయ ప్రచారం చేయటం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్టీల ప్రచారాలకు చిన్న పిల్లలను ఉపయోగించవద్దని సూచించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన వివిధ అనుమతులను తీసుకువచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు సువిధ పోర్టల్‌ను ఉపయోగించుకొని అనుమతులు పొందాలని తెలిపారు. ఎన్నికల కోసం తాత్కాలిక పార్టీ కార్యాలయాలను పోలింగ్ స్టేషన్కు రెండు వందల మీటర్ల దూరంలో ఏర్పాటు చేయకూడదని, ప్రైవేట్ స్థలాలలో, పాఠశాల సమీపంలో, ఆధ్యాత్మిక ప్రాంతాలకు దగ్గరగా పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. నిబంధనలు పాటించకుండా కార్యాలయాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు. బైక్ ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి చేశారు. కేవలం 10 బైకులకు మాత్రమే అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. రోడ్డు షో నిర్వహించేటప్పుడు రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ఆ కార్యక్రమంలో ఎన్ని వాహనాలు వాడుతున్నది ఎంతమంది ప్రజలు వస్తారనే విషయాన్ని ముందుగానే తెలియజేయాలని సూచించారు. పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని రాజకీయ పార్టీలు లౌడ్ స్పీకర్లను ఉదయం ఆరు గంటల లోపు రాత్రి పది గంటల తర్వాత ఉపయోగించకూడదని హెచ్చరించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి 24/7 కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేసుకోవాలని సూచించారు. సి విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను 100 నిమిషాలలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సివిజన్ యాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఇతర సమాచారం కొరకు ఫిర్యాదుల కోసం ఆర్ఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదులు ఇతర సమస్యలపై 08648 293795 నంబరులో సంప్రదించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఏ శాఖపైనైనా ఫిర్యాదులు వస్తే సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నియమావళి అమలుకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను వివరించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద వివిధ రిజిష్టర్డ్ లబ్ధిదారులకు యథావిధిగా ఉపాధి పనులు కల్పించవచ్చని చెప్పారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్

కోన వెంకట్ ప్రచారం

ప్రజాశక్తి-కర్లపాలెం: కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామంలో వైసీపీ అభ్యర్థి శాసనసభ్యులు కోన రఘుపతి తరపున ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికలలో మన అభ్యర్థి కోన రఘుపతిని గెలిపించుకోవడం వల్ల మన నియోజవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. మండలంలో జరిగిన అభివృద్ధి తోపాటు ఆగి ఉన్న నిర్మాణాలను పూర్తి కావడానికి ఆయనను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, మండల కన్వీనర్ ఏడుకొండలు, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ సీతారామరెడ్డి, మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు, ఎంపీటీసీ ఆసిఫ్ ఆలీ, నాయకులు సత్తిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, బెనర్జీ, ఇసాక్, ప్రసాద్, భావన్నారాయణ, శివారెడ్డి, షంషీర్, పెద్దబ్బాయి, మండల వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఫీజుతో సంబంధం లేకుండా..

పరీక్ష ఫీజు కట్టించుకోవాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో కొన్ని ఇంజనీరింగ్ కళాశాల్లో ఫైనల్ ఇయర్ విద్యార్థులు కళాశాల ఫీజు చెల్లించని కారణంతో పరీక్ష ఫీజులు కట్టించుకోమనే విద్యార్థులకు సర్క్యులర్లు పంపించడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్ ఖండించారు. మంగళవారం ఫీజులు అంశంపై మనోజ్ మాట్లాడుతూ విద్యార్థుల పరీక్ష ఫీజును వెంటనే కట్టించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా విద్యా దీవెన ఫీజులను తల్లి ఖాతాలో వేస్తోంది. దానికి అనుగుణంగా విద్యార్థులు ప్రభుత్వం నగదు విడుదల చేసిన తర్వాతే కళాశాలల్లో ఫీజులు కడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఖాతాల్లో డబ్బులు వేయకుండా ఫీజులు ఎలా చెల్లించగలరని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన తప్పిదానికి విద్యార్థులను బాధ్యులను చేయడం సరి కాదన్నారు. ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల చదువులు నష్టపోకుండా ఎటువంటి షరతులు లేకుండా పరీక్ష ఫీజులు కట్టించుకోవాలన్నారు. మొండిగా వ్యవహరిస్తే ఆందోళన చేస్తామని మనోజ్ హెచ్చరించారు.

పది పరీక్షకు 17 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరులో మంగళవారం జరిగిన పదో తరగతి నేచురల్ సైన్సు పరీక్షకు 17 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓలు ఎం సత్యనారాయణ, పి వెంకట్రామయ్య తెలిపారు. మండలంలోని పదో తరగతి పరీక్షలు జరుగు నాలుగు కేంద్రాలలో 732 మంది గాను 715 మంది హాజరైనట్లు వివరించారు. బుధవారం జరుగు సోషల్ స్టడీస్ పరీక్షతో పదో తరగతి పరీక్షలు ముగుస్తాయని ఎంఈఓలు వివరించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలే లక్ష్యం: ఎస్పి

ప్రజాశక్తి-వేటపాలెం

ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని, ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా పోలీసులు సంయుక్తంగా బాపట్ల జిల్లా చీరాల రూరల్ సర్కిల్ పరిధిలోని రామాపురం, కటారివారిపాలెం గ్రామాలలో మంగళవారం కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని ఈ కవాతు నిర్వహించారు. అనంతరం రెండు గ్రామాలలోని ప్రజలతో పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జరగాలనే ఉద్దేశంతో రామాపురం, కటారివారిపాలెం గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలు, జిల్లాలోని పోలీసులు సంయుక్తంగా కవాతు నిర్వహించారన్నారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా ముగిసే వరకు కేంద్ర బలగాలు జిల్లాలోనే ఉంటాయన్నారు. ఏదైనా గ్రామంలో గాని, ప్రదేశంలో గానీ గొడవలు, శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు ఆ ప్రదేశాలలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పడానికి పోలీస్ శాఖతో పాటు కేంద్ర సాయుధ బలగాలు కూడా విధులు నిర్వహిస్తాయన్నారు. ఎక్కడైతే శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందో, గతంలో ఏవైనా గొడవలు జరిగి ఉంటే అటువంటి గ్రామాలలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఆ క్రమంలోనే వేటపాలెం మండలంలోని రామాపురం, కటారివారిపాలెం గ్రామాలలో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఈ గ్రామాలలో గత సంవత్సరం గొడవలు జరిగాయని, వాటిపై కేసులు నమోదు చేసి సంబంధిత వ్యక్తులను అరెస్టు కూడా చేసినట్లు తెలిపారు. గతంలో జరిగిన గొడవలను మనసులో పెట్టుకొని మరల ఎవరైనా గొడవలకి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బ్రిజ్ కిషోర్ నేగి, చీరాల డిఎస్పి బి ప్రసాద్‌రావు, బిఎస్ఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది, అధికారులు రామాపురం, కటారివారిపాలెం గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు


ఎస్పి ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

వనరులు ఫుల్.. అభివృద్ధి నిల్..

- అభివృద్ధికి దూరంగా 'వైపాలెం'
- పట్టించుకోని అధికారులు
- పాలకుల మాటలు హామీలకే పరిమితం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గం అభివద్ధికి ఆమడ దూరంలో ఉంది. అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. 2009లో యర్రగొండపాలెం ఎస్‌సి నియోజకవర్గంగా ఏర్పడింది. ఇది పశ్చిమ ప్రాంతంలోని నల్లమల అడవి ప్రాంతానికి సమీపంలో ఉంది. ఇక్కడ అపారమైన ఖనిజ సంపద ఉంది. ముగ్గు గనులు అధికంగా ఉన్నాయి. బత్తాయి, బొప్పాయి లాంటి వాణిజ్య పంటలు పండుతాయి. ఈ ప్రాంత బత్తాయికి దేశంలోనే మంచి పేరు ఉంది. అయినప్పటికీ అభివృద్ధికి నోచడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఇక్కడి ప్రజల పేదరికం, దారిద్ర్యం మారడం లేదు. ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని పక్క రాష్ట్రానికి వలసలు తప్పడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రం ప్రతిసారీ హామీలపై హామీలు వస్తూనే ఉన్నాయి.

ముగ్గు గనులను పట్టించుకోని నేతలు..

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల మండలాలు నల్లమల అడవికి ఆనుకొని ఉన్నాయి. ఈ మండలాల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ముగ్గు గనులు, వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఆ ముగ్గు గనులను అభివృద్ధిలోకి తీసుకొచ్చిన దాఖలాలు లేవు. ఇక్కడి ముగ్గు రాయి అంతా రహస్యంగా కడప ప్రాంతానికి తరలిపోతుంది. ముగ్గు గనులను ఏర్పాటు చేస్తే సుమారు మూడు వేల మందికి ఉపాధి లభిస్తోంది.



బత్తాయి కాయలు లోడ్ చేస్తున్న కూలీలు



వలస వెళ్తున్న కూలీలు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మాయం..

గత టిడిపి ప్రభుత్వ హయాంలో త్రిపురాంతకం మండలంలోని గణపవరం ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ యూనిట్ నెలకొల్పితే సుమారు 3,500 మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా ఉపాధి కలుగుతుంది. మరో 3500 మంది రైతులకు పరోక్షంగా ఆదాయం సమకూరుతుంది. మంజూరైన యూనిట్‌ను నేతలు ఏర్పాటు చేయకుండా అశ్రద్ధ చేశారు. దీంతో రాజకీయం ఉపయోగించి కొందరు ఆ యూనిట్‌ను అద్దంకికి తరలించారు.

ఆగని వలసలు..

పాలకులు మారుతున్నా ఈ ప్రాంత వాసులకు ఉపాధి కోసం వలసలు తప్పడం లేదు. స్థానికంగా పది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ ఏదీ లేకపోవడంతో వలసలు అధికంగా ఉంటున్నాయి. గత్యంతరం లేక ప్రతియేటా 25 వేల మంది వలసబాట పడుతున్నారు. బతుకుదెరువు వెతుక్కుంటూ ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారు. వెనుకబడిన వర్గాల వారే ఎక్కువగా వలసబాట పడుతున్నారు. ఉద్ధరిస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్న పాలకులు గెలిచిన తర్వాత వారి వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా ఈ ప్రాంతాభివద్ధిపై పాలకులు నిర్దిష్టమైన ప్రణాళికలను విడుదల చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

హామీగా మారిన నీటి వనరులు..

వెలుగొండ ప్రాజెక్టు తీగలేరు కాలువ ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని 64 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండానే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెండు టన్నెల్‌లను జాతికి అంకితం చేశారు. తీగలేరు కాలువ అంతా మరమ్మతులకు గురైంది. టి-5 కాలువ నిర్మాణం పూర్తయితే పుల్లలచెరువు మండలంలో 11,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇది కూడా కాగితాలకే పరిమితమైంది. వెంకటాద్రిపాలెం సమీపంలోని కోటగట్ల చెరువు హామీగానే మిగిలింది. నియోజకవర్గ పరిధిలో 76 చెరువులు ఉన్నప్పటికి మరమ్మతులకు గురి కావడంతో వర్షాకాలంలోనూ చుక్క నీరు నిలవడం లేదు. ఆయకట్టు భూములన్నీ బీడు భూములుగా మారాయి.

హామీగా మారిన జ్యూస్ ఫ్యాక్టరీ..

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో బత్తాయి, బొప్పాయి లాంటి వాణిజ్య పంటలు పుష్కలంగా పండుతున్నాయి. ఈ ప్రాంతా బత్తాయి, బొప్పాయిలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. ఈ ప్రాంతంలో పండిన బత్తాయిలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని దేశంలోనే మంచి పేరు ఉంది. ఈ ప్రాంతంలో పండిన పంటలను దృష్టిలో పెట్టుకొని జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని 2009 నుంచి ప్రజా ప్రతినిధులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారే తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవు. జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తే మూడు వేల మందికి ఉపాధి కలుగుతుంది. రైతులకు రాబడి పెరిగే అవకాశం ఉంది.

మాజీ ఎంపిపి సుబ్బమ్మ మృతి

ప్రజాశక్తి-పిసిపల్లి



పులి సుబ్బమ్మ (ఫైల్)

పిసిపల్లి మాజీ ఎంపిపి పులి సుబ్బమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఈమె 2001-06 మధ్య కాలంలో ఎంపిపిగా పని చేశారు. ఈమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుబ్బమ్మ తన హయాంలో వివాదాలు, గొడవలకు తావు లేకుండా మండలాభివృద్ధికి కషి చేశారు. ఈమె పెద్దకుమారుడు పులి వెంకటేశ్వర రెడ్డి పాలకేంద్రం జిల్లా డైరెక్టర్‌గా పని చేశారు. రెండో కుమారుడు పాత నెల్లూరు జిల్లా తడలో స్వాతి గ్రూప్స్ అధినేతగా ఉన్నారు. చిన్న కుమారుడు కనిగిరిలో పిఎన్‌ఆర్ షూమార్టు నిర్వహిస్తున్నారు. ఈమె మతికి పిసిపల్లి జడ్‌పిటిసి పెద్దిరెడ్డి లక్ష్మీ కాంతం, ఓకె.రెడ్డి, పిసిపల్లి సొసైటీ అధ్యక్షుడు పోలు జయరామిరెడ్డి, పిసిపల్లి సర్పంచి తాళ్లూరి మరియమ్మ, అడ్వకేట్ బాలసాని మోహన్, టిడిపి మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య తదితరులు సంతాపం తెలిపారు. బుడ్డారెడ్డిపల్లిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



పల్లె పల్లెకు కార్యక్రమంలో మంత్రి సురేష్

పేదల సంక్షేమమే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-కొండపి

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైసిపి కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని ముప్పరాజుపాలెం, అనకర్లపూడి గ్రామాలలో పల్లెపల్లెకు మన సురేష్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గురించి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హుల అందరికీ అందించినట్లు తెలిపారు. తన ఒక్క అవకాశం ఇస్తే కొండపి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముప్పరాజుపాలెం గ్రామ సర్పంచి సుబ్బయ్య, అనకర్లపూడి గ్రామ సర్పంచి వేముల దనలక్ష్మి, వైస్ ఎంపిపి వేములు వెంకటప్రసాదు, వైసిపి మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, బొక్కిసం సుబ్బారావు, ఆయా గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను గౌరవించాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ షేక్ గౌస్ తెలిపారు. మండల పరిధిలోని చేన్నపునాయునిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మానవహక్కులు, వివిధ చట్టాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుని జీవితంలో మానవ హక్కులు అనేవి చాలా విలువైనవని తెలిపారు. ప్రతి ఒక్కరూ వాటిని గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇతర హక్కులకు కూడా భంగం కలిగించకుండా సమాజంలో ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగివుండాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్‌చాంద్‌బాషా, ఉపాధ్యాయులు సిద్ధయ్య, షరీఫ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ జాన్ ఇర్విన్

ఎన్నికల కోడ్ అమలు చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -కనిగిరి

ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా అమలు చేయడంలో గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులు కీలక పాత్ర పోషించాలని ఆర్‌డిఒ పాలపర్తి జాన్ ఇర్విన్ తెలిపారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కనిగిరి, పిసిపల్లి, హనుమంతునిపాడు, వెలిగండ్ల మండలాలకు చెందిన మహిళ పోలీసులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు తీసుకోకుండా రాజకీయ పార్టీలు ప్రచారం నిర్వహించడానికి వీలు లేదన్నారు. అలా చేస్తే వెంటనే అడ్డుకోవాలన్నారు. అనుమతి తీసుకుని ప్రచారం నిర్వహిస్తున్నారా లేదా అని నాయకులను అడిగి నిర్ధారించుకోవాలన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రచార వాహనాలకు సైతం అనుమతులు తీసుకోవాలని లేకుంటే ఫిర్యాదు చేయాల న్నారు. సి విజిల్ యాప్‌లో కోడ్ ఉల్లంఘనపై ఇతరులు ఫిర్యాదు చేయక ముందే గ్రామ వార్డు సచివాలయ పోలీసులు తెలుసుకొని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. తనిఖీ అధికారుల బందం క్షేత్రస్థాయిలోకి వచ్చినప్పుడు మహిళా పోలీసులు అందు బాటులో లేకపోతే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా, అర్హత కలిగిన ప్రతి ఒక్కరు నిర్భయంగా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహశీల్దార్లు సురేష్, కిషోర్, షేక్ నాగూర్ మీర,పాషా, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి దర్శి నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెదవుయ్యాలవాడ పంచాయతీలో మన ఊరికి- మన శివన్న కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పోతంశెట్టి సీతా రామమ్మ, మురళీమోహన్, శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లు, వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టుకోట హరీష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : బిఎన్

ప్రజాశక్తి-చీమకుర్తి

టిడిపితోనే పేదల అభివృద్ధి సాధ్యమని టిడిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి,మాజీ ఎమ్మెల్యే బిఎన్ .విజయకుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఏలూరివారి పాలెంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచకపాలన సాగుతుందన్నారు. వైసిపి పాలనలో రాష్ట్ర అంధకారంలో ఉందన్నారు. టిడిపి అధికారం లోకి వచ్చాకా అమలు చేసే పథకాల గురించి ఇంటింటికి తిరిగి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకుడు అడకా స్వాములు, జిల్లా నాయకులు మన్నం ప్రసాదు, కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ళ గంగాధరరావు, ఉన్నం సుబ్బారావు, గోగినేని రాజా,జి. రాఘవరావు,వేల్పుల శ్రీను, పుట్టా బ్రహ్మయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, మన్నం శేషయ్య , టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

ప్రజాశక్తి-పొదిలి

రాజకీయ నాయకులు ప్రచార వాహనాలు, ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వ హించేందుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మార్కా పురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొదిలి, కొనకనమిట్ల మండలాల బూత్ లెవల్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు బహిరంగ సభలు, సమావేశాలకు అనుమతి తీసుకున్నారా లేదా అని పరిశీలించా లన్నారు. ఎమ్మెల్యే అభ్యరి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయ కూడదన్నారు. ఫీల్డ్‌లో అధికారులు ఈ విషయాలను తప్పనిసరిగా పరిశీ లించాలన్నారు. అభ్యర్థులు నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గౌసియాబేగం, తహశీల్దారు మహమ్మద్ జియా హుల్ హక్, ఇఒఆర్‌డి, విఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం : ఎన్నికల ప్రవర్తన నియమావళిని అధిగమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీలేఖ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాములు నాయక్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సార్వత్రిక ఎన్నికల నియమావళిపై రాజకీయ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో పార్టీలకు సంబంధించిన ఎలాంటి బోర్డులు, ఫ్లెక్సీలు కనిపించరాదన్నారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ప్రచారాలు, ర్యాలీలు నిర్వహించరాదని తెలిపారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించినా, ప్రచారాలు చేసినా, వాహనాలకు పార్టీ స్టిక్కర్లు అతికించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

శింగరాయకొండ : ఎన్నికల కోడ్ అమలు కాకపోతే చర్యలు కఠినంగా ఉంటాయని కొండపి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల కోడ్‌పై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో మహిళా పోలీసులు ఉదయం సాయంత్రం సమయంలో పరిశీలించాలన్నారు. రాజకీయ పార్టీల జెండాలు బ్యానర్లు ఎక్కడ కనిపించడానికి వీలు లేదన్నారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలనా్రు. ఈ విషయంలో అధికారులు అలసత్వం వహించ రాదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎం. భవాని శంకర్, ఎంపిడిఒ నగేష్ కుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండపి : ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగ కుండా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని నోడల్ అధికారి టి.విక్టోరియారాణి తెలిపారు. మండల పరిధిలోని చోడవరం గ్రామంలో ఓటర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించ ుకోవాలన్నారు. 81 సంవత్సరాలు నిండడిని వృద్ధులకు, ఎలక్షన్ కమిషన్ బ్యాలెట్ ఓటు కల్పించినట్లు తెలిపారు. బ్యాలెట్ ఓటు వినియోగంపై వృద్ధులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి- కొండపి

కొండపి వేలం కేంద్రానికి అయ్యపురాజుపాలెం, నరసరాజు పాలెం, పెద్దకండ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు 820 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 692 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 128 బేళ్లను తిరస్కరించారు.కిలో పొగాకు అత్యధిక ధర రూ.231, అత్యల్ప ధర రూ.220, సరాసరి ధర కిలో రూ.229.01పైసలు పలికింది.

ముగ్గురు వాలంటీర్లు రాజీనామా


ప్రజాశక్తి-కొండపి

కొండపి -2 సచివాలయ పరిధిలోని కట్టావారిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు వాలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ సెక్రటరీ పూజితకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కొండపి ఎమ్మెల్యేగా ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులుగా చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి గెలుపునకు కృషి చేసేందుకు తాము స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు తెలిపారు.

వైద్యశాలలో తనిఖీ

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షుడు మేకల చిన్న తిరుపతి కోరారు. సిఎస్‌పురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్య సిబ్బంది అందుబాటులో లేక పోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ వైద్యశాలపై ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వైద్యాశాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన మేర వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించినా వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఇఒ

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-చీమకుర్తి

విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను సకాలంలో పూర్తి చేయించి దిద్దాలని ఎంఇఒ-1 ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని పాటిమీదపాలెం యుపి, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఎస్ఎ2 పరీక్షలకు విద్యార్థులను సిద్దం చేయాలన్నారు. మధ్నాహ్న భోజనం మెనూ పాటించాలన్నారు.నాడు-నేడు పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.నిధులు ఉన్న ప్రధానోపాధ్యాయులు పనులు సత్వరం పూర్తి చేయడానికి ప్రయత్నించాలన్నారు.అనంతరం ఆయా పాఠశాలల్లో నాడు-నేడు పనులను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె. శిలార్, శర్మ, ఉపాధ్యాయులు వాకా కవిత, నాగమల్లేశ్వరి, నాగలక్ష్మి, సరోజిని పాల్గొన్నారు.

మాగుంటను కలిసిన వెంకటేష్

పామూరు : ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డిని ఒంగోలులోని ఆయన క్యాంపు కార్యాలయంలో టిడిపి యువ నాయకుడు, పామూరు-2 ఎంపిటిసి ఆకుపాటి వెంకటేష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా మాగుంటను ఘనంగా సన్మానించాడు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎఎంసి మాజీ చైర్మన్ ఘనశ్యామ్, పశుసంవర్ధక శాఖ మాజీ చైర్‌పర్సన్ రంగసాయి, జనసేన కార్పొరేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థుల పేరుతో నీటి సరఫరా

ప్రజాశక్తి-పొదిలి

ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకూ అధికార పార్టీ నాయకులు ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని కానుకలు, బహుమతులు అందజేస్తున్నారు. ఇప్పుడు నీటి ఎద్దడి తలెత్తడంతో ప్రజల నుంచి ఎక్కడ వ్యతిరేకత వస్తుందోనన్న నీటి సమస్యను పరిష్కరించే పనిలో పడ్డారు. గత రెండు నెలలుగా మండలంలో పలు గ్రామాలతో పాటు పట్టణంలో నీటి ఎద్దడి నెలకొన్న పట్టించుకోని నాయకులు ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పొదిలిలో నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెం, కంభాలపాడు, పోతవరం గ్రామాలలో ట్యాంకర్ల ద్వారా మంగళవారం నీటిని సరఫరా చేశారు. నీటి ఎద్దడిని ముందుగానే గుర్తించిన అధికారపార్టీ నాయకులు నీటి సరఫరాకు ఎక్కడిక్కడ తమ అనుచరులకు అనుమతులు ఇచ్చారు. ఒక్కోక్క ట్రిప్పుకు రూ.300-350 చెల్లించే విధంగా ఒప్పందం జరిగినట్లు సమాచారం. దీంతో వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో పేరుతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ నీటి కష్టాలు ఉండవని ప్రజలు భావిస్తున్నారు.


ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్న దృశ్యం

ముప్పావారిపాలెం విద్యార్థుల ప్రతిభ

చీమకుర్తి : మండల పరిధిలోని ముప్పావారిపాలెం హెచ్‌డబ్ల్యు ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న 9 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు మాదాల హనుమంతరావు మంగళవారం అభినందించారు. అనంతరం హనుమంతరావు మాట్లాడుతూ 10 మంది ప్రవేశ పరీక్ష రాయగా అందులో 9మంది ఐదవ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారన్నారన్నారు. బక్కా చైతన్య,బక్కా నవ్య, బక్కా కల్యాణి చీమకుర్తి బాలికల గురుకుల పాఠశాలలో, బక్కా అఖిల్ కురిచేడు గురుకుల పాఠశాల,బక్కా రుచిత కొండపి గురుకుల పాఠశాల, గజ్జా మురారి, ఇండ్ల చిన్నయ్య, బక్కా నొవాహు అర్ధవీడు గురుకుల పాఠశాల, గజ్జా మైథిలీ నాగులవరం గురుకుల పాఠశాలలో సీట్లు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ముప్పరాజు వెంకటరావు,విద్యా కమిటీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త కనిపిస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

రోడ్లమీద చెత్త, చెదారాలు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జస్వంతరావు హెచ్చరించారు. పారిశుధ్యవిభాగం సిబ్బందితో నగరంలోని పారిశుధ్య పరిస్థితులపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం ప్రతిరోజు శుభ్రంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని సూచించారు. ఐదు రోజులలో నగరంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగు పరచాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మనోహర్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్లు బాబ్జి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

గిద్దలూరు : మండలపరిధిలోని కొత్తకోట పంచాయతీకి చెందిన 150 కుటుంబాల వారు వైసిపిలో చేరారు. వైసిపి గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొర్రా కష్ణారెడ్డి, పగడాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

గిద్దలూరు : మండల పరిధిలోని నరవ బయనపల్లి గ్రామానికి చెందిన పలువురు మంగళవారం టిడిపిలో చేరారు. టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేశారు. అశోక్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపిటిసి మీసాల పాపయ్య యాదవ్ ఆధ్వర్యంలో40 కుటుంబాల వారు టిడిపిలో చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, వెలిదేండ్ల బాల రంగారెడ్డి, బోయిల్ల పోలిరెడ్డి, చింతకుంట్ల పిరయ్య తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలన

సిఎస్ పురంరూరల్ : విద్యార్థులు ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.అంజల తెలిపారు. స్థానిక బిసి బాలుర హాస్టల్, శీలంవారిపల్లి లోని బాలికల హాస్టల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా హాస్టల్స్ లోని రిజిస్టర్లు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వేసవి సెలవులలో నీటి కుంటలు, చెరువులు వైపు వెళ్లరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు చెన్ననాయుడు, డి.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో పరిశీలన

చీమకుర్తి : విద్యార్థులు నిరంతర పఠనంతో మంచి ఫలితాలు సాధించవచ్చుని ఐఎఎస్ అధికారి గగారిన్ పేర్కొన్నారు. స్థానిక గిరిజన గురుకుల పాఠశాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గిరిజన గురుకుల,ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ప్రేరణాత్మక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు మధుబాబు, జోషిబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో పదో విడత పోరుబాట

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం 10వ విడత పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో భట్టిప్రోలులోని జగనన్న కాలనీలో జరిగిన పోరుబాట కార్యక్రమంలో సాయిబాబా మాట్లాడుతూ భట్టిప్రోలులో సుమారు 34 ఎకరాల భూమిని కొనుగోలు చేసి దాదాపు 1174కు పైగా పట్టాలను మంజూరు చేసినప్పటికీ దానిలో కనీస మౌలిక వస్తువులు లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిలో రెండెకరాల భూమి కోర్టులో ఉండగా 104 మందికి తాత్కాలిక పట్టాలు మంజూరు చేసి భూమిని చూపించకుండా అలాగే మిగిల్చారు. మిగిలిన భూమిలో పట్టాలు పొందిన వారు 1,070 మంది ఉన్నారు. వీరిలో 350 గృహాలు రద్దు అయ్యాయన్నారు. దీనికి కారణం ప్రభుత్వం ముందుగానే స్థలంతో పాటు గృహాన్ని నిర్మించేస్తామని చెప్పటంతో లబ్ధిదారులు ఆశపడ్డారు. దీని కారణంగా గృహాలు నిర్మించుకోలేకపోవడంతో మంజూరును తాత్కాలికంగా నిలిపివేశారన్నారు. కాగా మిగిలిన 713 మందికి గాను 440 గృహాలు బేసిమెంట్ స్థాయిలో నిలిచిపోగా 19 గృహాలు మాత్రం పూర్తి చేసుకున్నాయి. కానీ వీరు కూడా గృహప్రవేశాలు చేసుకోలేకపోయారన్నారు. దీని



జగనన్న కాలనీ పరిశీలిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ద్వారా 5 శాతం గృహాలు కూడా పూర్తికాని పరిస్థితి నెలకొందని అన్నారు. ఓ పక్క ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మరొకపక్క మంత్రి నాగార్జున, ప్రస్తుతం వరికూటి అశోకబాబులు కనీసం గృహ నిర్మాణాలు చేపట్టకపోగా కనీసం మౌలిక సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు. భట్టిప్రోలు జగనన్న కాలనీలో ఒక రోడ్డు గానీ, తాగునీటి సౌకర్యం గాని, మురుగునీరు పారుదల కావడానికి డ్రైనేజీ వ్యవస్థ గాని నిర్మించిన దాఖలాలు లేవని, ఎలాంటి వసతులు లేకుండా లబ్ధిదారులు ఏ విధంగా గృహాలు నిర్మించుకుంటారని ఆయన ప్రశ్నించారు.

నాయకులే కాంట్రాక్టర్లు

దీనిలో అధికార పార్టీకి చెందిన నాయకులు కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తడంతో తీవ్రంగా అవినీతి జరిగిందని ఆరోపించారు. గృహ నిర్మాణాలు చేపడతామని ఒక్కొక్కరు 100 నుంచి 150 గృహాలు చొప్పున ఇద్దరు వ్యక్తులు కాంట్రాక్టు తీసుకుని దానిలో వాడాల్సిన మెటీరియల్ నిబంధనలకు విరుద్ధంగా వినియోగించి సొమ్ము చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణానికి పిల్లర్స్‌లో 10 ఎంఎం ఇనుముకు బదులు 8 ఎంఎం ఇనుము వినియోగించి తక్కువ నాసిరకం సిమెంటుతో ఒక్కో కట్టకు వినియోగించాల్సిన మోతాదు కంటే తక్కువ మోతాదు వినియోగించి లబ్ధిదారులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గృహ నిర్మాణ శాఖ నిబంధనల ప్రకారం పది అడుగుల లోతు బోర్లు తీయాల్సి ఉండగా అందుకు భిన్నంగా ఆరు నుంచి ఏడు అడుగులు మాత్రమే బోర్లు తవ్వి దానిలో ఇనుమును మిగిల్చుకుని కక్కుర్తికి పాల్పడ్డారని దీని కారణంగా పది కాలాలపాటు 10 కాలాలపాటు పదిలంగా ఉండాల్సిన గృహాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి పాలల్లో జరిగిన అవినీతి, అక్రమాలు, అభివృద్ధి నిరోధక చర్యలను ప్రజల దృష్టికి తీసుకురావాలని ఉద్దేశంతో ఇప్పటివరకు ఆయా ప్రాంతాల్లో పది విడతలు పోరు బాట కార్యక్రమం చేపట్టడం జరిగిందని సాయిబాబా తెలిపారు. ఈయన వెంట నాయకులు బట్టు మల్లికార్జునరావు, కనపర్తి సుందర్రావు, ఎడ్ల జయసిలరావు తదితరులు ఉన్నారు.

రేపు 'ప్రత్యేక' వైద్య శిబిరం

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి స్థానిక భవిత కేంద్రం, ఎంపియుపి స్కూల్ (సత్రంబడి) ఆవరణంలో సహిత విద్య – సమగ్ర శిక్ష బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో 6 నుంచి 18 సంవత్సరాల లోపు వయసున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల కోసం వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అద్దంకి మండల విద్యాశాఖాధికారులు డి గంగాధరరావు, బి సుధాకరరావు తెలిపారు. ఈ నెల 28వ తేదీ గురువారం ఉదయం 8 నుంచి 3 గంటల వరకు స్థానిక సత్రంబడిలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ పరిధిలోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె పంగులూరు, కొరిసపాడు మండలాలలోని వినికిడి లోపం గలవారికి వినికిడి యంత్రాలు, దృష్టిలోపం గలవారికి కంటిఅద్దాలు, బ్రెయిలీ కిట్, మానసిక వైకల్యం, ఆటిజం (బుద్ధి మాంద్యత) గలవారికి టిఎల్ఎం కిట్, శారీరక



విలేకరులతో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు

అంగవైకల్యం గలవారికి ట్రై సైకిల్, వీల్ చైర్, రోలేటర్ మొదలగు ఉపకరణాలు నిపుణులైన డాక్టర్లచే వైద్య ధ్రువీకరణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా అందజేస్తారని అద్దంకి మండల విద్యాశాఖాధికారులు తెలియజేశారు. ఈ వైద్య శిబిరానికి హాజరయ్యేవారు సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, క్యాస్ట్ సర్టిఫికెట్ జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, యుడిఐడి కార్డు తీసుకొని రావాలని వారు తెలియజేశారు. పూర్తి వివరాలకు 9849960723, 9100996459 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-రేపల్లె

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆర్టీవో హేలా షారోన్ అధికారులను ఆదేశించారు. నియోజక వర్గంలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సంబంధించి నగరం మండలంలోని సచివాలయాలను సందర్శించి, రేపల్లెలో ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు భద్రపరచు స్ట్రాంగ్ రూమ్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ.. ఒకే స్థానంలో 4, 5 మల్టిపుల్ పోలింగ్ కేంద్రాలు ఉంటే ఆయా పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ రోజు ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దివ్యాంగుల కోసం ర్యాంప్, అన్ని కేంద్రాల్లో వెలుతురు కోసం లైటింగ్, ఫ్యాన్లు, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు తనిఖీ చేసి అన్ని వసతులు ఉన్నాయా లేదా అనేది పరిశీలన చేసి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్‌డిఒ హేలా షారోన్

జగన్‌రెడ్డిది అరాచక పాలన


అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

కాకినాడ శివాలయంలో అర్చకునిపై వైసీపీ నేత దాడి ఘటన జగన్‌రెడ్డి అరాచక పాలనకు నిదర్శనమని, యథా నాయకుడు–తథా క్యాడర్ అన్న చందంగా వైసీపీ నేతలు అధికార మదంతో విర్రవీగుతున్నారని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అర్చకులపై దాడి చేయడం, వారిని బెదిరింపులకు గురిచేయడం రాక్షసత్వమే అవుతుందని పేర్కొన్నారు. భగవంతుని సన్నిధిలో అందరూ ఒక్కటే అనే ఇంగితజ్ఞానం కూడా వైసీపీ నేతలకు లేకపోవడం బాధాకరమన్నారు. హిందూ ఆలయాలు, ఆస్తులపై పూర్తి ఆధిపత్యం చెలాయించే క్రమంలోనే వైసీపీ ప్రభుత్వం దారుణాలకు ఒడిగడుతోందన్నారు. కాకినాడ శివాలయంలో తాను తెచ్చిన పాలు శివలింగంపై సరిగా పోయలేదని అర్చకుడిని వైసీపీ నేత చంద్రరావు దాడి చేసి, చెంపపై కొట్టి కాలితో తన్నాడన్నారు. అడ్డుకోబోయిన మరో అర్చకుడిపైనా దాడి చేసి బూతులు తిట్టాడన్నారు. అలాగయితే మరి రాష్ట్రాన్ని రావణకాష్టం చేసిన జగన్‌రెడ్డి సహా వైసీపీ నేతలందరినీ ప్రజలు ఏం చేయాలి. దేనితో కొట్టాలని రవికుమార్ ప్రశ్నించారు. ఈ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో హిందూ దేవాలయాల అభివృద్ధిని విస్మరించారన్నారు. అర్చకులకు ఆదుకోకపోగా వారిపై దాడులకు దిగుతున్నారని అన్నారు. కరోనా సమయంలో విధి నిర్వహణలో చనిపోయిన అర్చకుల కుటుంబాలను కూడా జగన్‌రెడ్డి ఆదుకోలేదన్నారు. పైగా ఈ అయిదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో హిందూ దేవాలయాలపై,



అర్చకులపై దాడులు నిత్యకత్యమయ్యా యని అన్నారు. బాధిత అర్చకులు స్వయంగా ఫిర్యాదు చేసినా ఈ ఐదేళ్లలో ఒక్కరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాల్లేకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని పంచారామ క్షేత్రమైన సోమేశ్వరస్వామి ఆలయ అర్చకుడి యజ్ఞోపవీతాన్ని వైసీపీ నేత యుగంధర్ తెంచేశాడన్నారు. ఆ దారుణంపై ప్రశ్నించిన అర్చకునిపై దాడి చేశాడు. కార్తీక పౌర్ణమి సందర్భంగా కర్నూలు జిల్లా ఓంకార క్షేత్రంలో భక్తుల రద్దీ దృష్ట్యా టికెట్ జారీ విషయంలో గొడవ జరిగి అర్చకులపై ఆలయ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి దాడి చేశాడు. పలువురు వైసీపీ నేతలు అర్చకులను చెర్నాకోలుతో చితకబాదారు. నరసరావుపేట శ్రీత్రికోటేశ్వరస్వామి వారి దర్శనానికి వచ్చిన ఓ వైసీపీ నేత ఆలయ అర్చకుడు తనకు సరిగా మర్యాద చేయలేదంటూ దాడి చేశాడన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి గుడి అర్చకుడు ఆలయానికి చెందిన భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఆ భూమిపై కన్నేసిన స్థానిక వైసీపీ నేతలు ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో పూజారి భార్య పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలులో రామలింగాచారి అనే అర్చకుడి ఇంటిని అధికార పార్టీ నేతలు కూల్చేయడంతో ఆ బాధ తట్టుకోలేక ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇలాంటి ఘటనలు ఈ ఐదేళ్లలో లెక్కలేనన్ని జరిగాయన్నారు. కొన్ని ఆలయాల్లోనైతే కారణం లేకుండానే అర్చకులపై వైసీపీ నేతలు దాడులకు దిగిన ఘటనలున్నాయి. గుంటూరు జిల్లా గోరంట్లలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు ఆరోగ్యం బాగోలేక శెలవు అడిగితే.. ఏకంగా అధికారులే అతనిపై దాడిచేసి గాయపరిచారు. సమాజ శ్రేయస్సు, ప్రజల క్షేమం కోరే బ్రాహ్మణులు.. అర్చకులపై వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 47 రోజుల్లో రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే రవికుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



వర్క్‌ షాపులో పాల్గొన్న విద్యార్థినులు

క్లౌడ్ కంప్యూటింగ్‌పై వర్క్‌షాపు ప్రారంభం

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో క్లౌడ్ కంప్యూటింగ్‌పై వర్క్ షాపును ప్రారంభించారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ.ఒ.టి) విభాగం ఆధ్వర్యంలో బిటెక్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్‌పై వర్క్‌షాపును నిర్వహిస్తున్నారని కళాశాల ప్రధాన అధ్యాపకులు మొయిద వేణుగోపాలరావు తెలిపారు. ఈ వర్క్‌షాపును సిహెచ్ గోపిరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగాధిపతి ఎస్ ఇంద్రనీల్ తెలిపారు. ఈ వర్క్ షాపులో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొంటున్నారు.



గంగవరం రోడ్డులో జెసిబితో పూడిక తీస్తున్న దృశ్యం

మురుగు కాలువలో పూడిక తొలగింపు

ప్రజాశక్తి-ఇంకొల్లు

స్థానిక గంగవరం రోడ్‌లో మురుగు కాలువలో పూడిక ఏర్పడి నీళ్లు పోకుండా నిలబడి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ ప్రాంతవాసులు పంచాయతీకి, ఆర్‌అండ్‌బికి ఫిర్యాదు చేయడంతో మంగళవారం నీరు ఆగిపోయిన ప్రాంతంలో కాల్వలో పూడిక తీసేదేందుకు జెసిబిని ఏర్పాటు చేసి తొలగించే కార్యక్రమం చేపట్టారు. కాలువలపై ఉన్న బండలు, ఆక్రమణలు, రోడ్డుకు ఇరువైపులా కాలువల్లో ఉన్న పూడిక, మురుగును తొలగించి నీరు సజావుగా ముందుకు సాగేటట్లు ఏర్పాటు చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు మహిళలు

ఏల్చూరులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ప్రజాశక్తి-సంతమాగులూరు

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలుగు మహిళా నేతలు ప్రజలకు వివరించారు. మంగళవారం మండలంలోని ఏల్చూరు గ్రామంలో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు పథకాల అమలును ప్రజలకు వివరించారు. గ్రామంలోని ముస్లిం కాలనీ, సినిమా హాల్ సెంటర్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ద్వారా వివరించారు. గతంలో రవికుమార్ హయాంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ముస్లింలకు రంజాన్ తోఫా, చంద్రన్న పెళ్లి కానుక వంటి పథకాలతో పేద ప్రజలను ఆదుకున్న ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందన్నారు. జనసేన, తెలుగుదేశం పార్టీ, బిజెపి పార్టీల కూటమితో ప్రభుత్వం ఏర్పడగానే సంక్షేమ పథకాలతో మహిళలకు పెద్దపీట వేయడం జరుగుతుందని వారు మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు నాగబోతు సుజాత, కొనికి గోవిందమ్మ, గుమ్మా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జెడి శీలం

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జెడి శీలం

ప్రజాశక్తి-బాపట్ల

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కమిటీ సభ్యులు సమర్థవంతంగా కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జెడి శీలం అన్నారు. మంగళవారం బాపట్ల కాపు కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి బూత్‌కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ముగ్గురు ఏజెంట్లు చొప్పున సమర్థవంతంగా పనిచేసే కాంగ్రెస్ కార్యకర్తలను నియమించాలన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి బలమైన శక్తిగా రాష్ట్రంలో పుంజుకుంటుందన్నారు. ఆ దిశగా కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలన్నారు. నియోజకవర్గాల వారీగా బూత్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు ఆయా నియోజకవర్గాల నాయకత్వానికి బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలోకి తీసుకెళ్లి విస్తత ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో పార్లమెంట్ కోఆర్డినేటర్ శ్రీపతి రాజేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ కన్వీనర్ గంటా అంజిబాబు, బాపట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరాజ్, కాంగ్రెస్ నాయకులు పఠాన్ రాజేష్, మహిళా నాయకురాలు రేణుక, బాపట్ల ,రేపల్లె వేమూరు, చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ బాధ్యులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లిములకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ముస్లిములతో మాట్లాడుతున్న దామచర్ల

అల్లా చూపిన సన్మార్గం సమస్త మానవాళికి అనుసరణీయం, ఆచరణీయమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బాపూజీ కాంప్లెక్స్ వద్ద ఒంగోలు నగరం నుండి ఉమ్రా యాత్రలో భాగంగా పవిత్ర మక్కాకు బయలుదేరుతున్న ముస్లిములను మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం దువా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్రా యాత్రకు వెళుతున్న వారితో మాట్లాడారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న మీ అందరికీ అల్లా ఆశీస్సులు తప్పక లభిస్తాయన్నారు. మక్కా మదీనా సందర్శించినప్పుడు విశ్వ మానవ శ్రేయస్సు కోసం అల్లాను ప్రార్థించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పఠాన్ హనీఫ్ ఖాన్, ఎమ్‌డి సాధిక్, షేక్ అబ్దుల్ రషీద్, కాలేషా బాబు, గోల్డ్ మున్నా, ముస్లిములు పాల్గొన్నారు.

'శ్రీరామ్' ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-అద్దంకి

శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శింగరకొండ గుడి దగ్గర ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ చాపల వంశీకష్ణ సహకారంతో సోమవారం ఉదయం నుండి మంగళవారం ఉదయం వరకు పగలు, రాత్రి నిరంతరం జరిగిన ఈ ఉచిత వైద్య శిబిరంలో అన్ని రకాల ఎమర్జెన్సీ కేసులకు అనుభవజ్ఞులైన వైద్యులచే ప్రాథమిక వైద్యం అందించారు. షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. 600 మందికి ఉచితంగా వైద్యసేవలందించారు. కార్యక్రమంలో జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, మేనేజర్ దాసరి సుధాకర్, రవి, నాగరాజు, స్వర్ణలత, కష్ణ వేణి, సునీత, మణికంఠ పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటను కలిసిన ఆర్‌ఎంపీలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



మాగుంటతో ఆర్‌ఎంపీలు

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఆర్‌ఎంపి సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి ఎంపీ అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా స్థానిక రాంనగర్ 2వ లైన్‌లోని మాగుంట కార్యాలయంలో మాగుంటని కలిసి అభినందించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఆర్‌ఎంపిల సంఘం అధ్యక్షులు కె.మాలకొండయ్య, కార్యదర్శి కె. బాలచంద్రం, సంయుక్త కార్యదర్శి పివి కష్ణారావు, డివిజన్ కార్యదర్శి లెనిన్ బాబు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు ఉన్నారు.

తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు

- **నీటి వనరులను సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షణ**
- **అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం**

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వేసవిలో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా అందుబాటులో వున్న నీటి వనరులను సద్వినియోగం చేసుకునేలా సమగ్ర పర్యవేక్షణ అవసరమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ దిశగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఇందుకోసం మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో ఆయన జెసి ఆర్.గోపాలకష్ణతో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 8వ తేదీన సాగర్ నీరు విడుదలయ్యే అవకాశం ఉన్నదని, ఐదు రోజుల తరువాత ఈ నీళ్లు జిల్లాలోకి ప్రవేశిస్తాయని ఇరిగేషన్ అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ దష్టికి తెచ్చారు. కాగా ఈ నీళ్ల చోరీకి గురికాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ సిబ్బందితో సహారాకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌తో తాను మాట్లాడతానని తెలిపారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను వీలైనంత త్వరగా నింపడంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా గ్రామాలలో చేతిపంపుల మరమ్మతు పనులను తక్షణమే చేపట్టాలని, ఈ దిశగా 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిపిఒ, జడ్పీ సిఇఒ సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నిధులను ఖర్చు చేస్తున్న తీరును ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించాలని వారిని ఆదేశించారు. చేతిపంపుల స్థితిగతులపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రతి వారం రిపోర్టు తెప్పించుకోవాలన్నారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంపై ప్రజలకు "గ్రామ జల సంఘాల" లోని స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా విస్తత అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రౌండ్ వాటర్ , డ్వామా అధికారులు సమన్వయంతో పనిచేసి భూగర్భ నీటి మట్టం పెరిగేలాగా పనులు చేపట్టాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ఎక్కడా వాల్టా చట్టం ఉల్లంఘన జరుగకుండా చూడాలన్నారు. మంచి నీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్లపై రాజకీయ పార్టీల, నాయకుల ఫోటోలు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ట్యాంకర్ల ద్వారా నీళ్ల సరఫరా చేస్తున్న ప్రాంతాలలో వాటర్ ఆడిటింగ్ పక్కాగా ఉండాలని ఆయన పునరుద్ఘాటించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మర్దన్ అలీ. డిఆర్‌డిఏ పీడీ టి.వసుంధర, డ్వామా పీడీ అర్జున్ రావు, డిపిఒ ఉషారాణి, జడ్.పి. సిఈఒ కె.మాధురి, ఒంగోలు, ఇతర మున్సిపాలిటీల కమిషనర్లు, పబ్లిక్ హెల్త్, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈలు, ఏఈలు, ఎపిసిపిడిసిఎల్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠినచర్యలు: డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-బాపట్ల

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్ష నేరమని, అలా చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఎస్.విజయమ్మ హెచ్చరించారు. మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలో నిర్వహించిన పిసిపిఎన్‌డిటి యాక్ట్ జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ బాపట్ల డివిజన్, సబ్ డివిజనల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అబార్షన్ చేసేందుకు అనుమతి లేని ఆసుపత్రుల్లో అబార్షన్ చేస్తే యాక్ట్ ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి అంగన్‌వాడి కేంద్రానికి వచ్చే గర్భిణీ స్త్రీలకు వారి సభ్యులకు ఆడపిల్లల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని రిజిస్టర్ స్కాన్ సెంటర్లు తప్పనిసరిగా ఫారం ఎఫ్ సైట్ ద్వారా నమోదు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో టి.వెంకటేశ్వర్లు, రోహిణి రత్నశ్రీ, సౌజన్య, బాపట్ల వైద్యశాల గైనకాలజిస్ట్ శాంతి వైష్ణవి, ఎపిపి మహేందర్‌నాథ్, మహమ్మద్ ఖాన్, రోజ్ ప్రసాద్, బి.మరియమ్మ, ఆర్.అరుణ పాల్గొన్నారు.

ఒంగోల్ ఎవరిదో.?

- **ఇంటింటి ప్రచారంలో టిడిపి, వైసిపి నేతలు**
- **అభ్యర్థులకు తోడుగా కుటుంబ సభ్యుల ప్రచారం**
- **ఓటరు మొగ్గు ఎటు వైపో.?**





ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఆసక్తికర పోరుకు తెర లేసింది. నియోజకవర్గంలో మూడోసారి ఆయా పార్టీల సీనియర్లు పోటీకి దిగుతున్నారు. తాజా మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టిడిపి మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు వరుసగా మూడోసారీ పోటీకి సై అంటున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులకు తోడు వారివారి కుటుంబసభ్యులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. రానున్న ఎన్నికలలో ఎవరికి వారే గెలుపు తమదే అనే ధీమాతో ఉన్నారు.

జిల్లా కేంద్రమైన ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం జిల్లాలోనే ప్రత్యేకమైంది. ఒంగోలు అసెంబ్లీ నియోజకం, పార్లమెంట్ నియోజకవర్గాలు జిల్లాకు ముఖ్యమైనవి ఉన్నాయి. ఒంగోలు నియోజకవర్గంలో వరుసగా 2014, 2019, 2024 సంవత్సరాలలో తాజా మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టిడిపి అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు పోటీ పడుతున్నారు. 2014 ఎన్నికలలో అప్పటి టిడిపి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు 20 వేల పైచిలుకు మెజార్టీతో వైసిపి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిపై విజయం సాధించారు. 2019 సంవత్సరంలో వైసిపి ప్రభంజనంతో తాజా మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, ప్రత్యర్థి టిడిపి అభ్యర్థి దామచర్ల జనార్ధనరావుపై 22 వేల పై చిలుకు మెజార్టీతో విజయాన్ని అందుకున్నారు. 2024 ఎన్నికలలో గెలుపు ఇరు పార్టీలకు కీలకం కానుంది. అధికార పార్టీ తరపున అభ్యర్థిగా తాజా, మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పోటీ చేస్తున్నారు. టిడిపి- జనసేన- బిజెపి కూటమి తరపున టిడిపి ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా దామచర్ల జనార్ధనరావు పోటీలో ఉన్నారు. ఇరు పార్టీల అభ్యర్థులు గెలుపు నీదా, నాదా అన్న రీతిలో ప్రచారంలో ఉన్నారు.

ఇంటింటి ప్రచారంలో..

అధికార వైసిపి అభ్యర్థి బాలినేని శ్రీనివాస రెడ్డి, టిడిపి అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు, ఇటీవల ఒంగోలు నియోజకవర్గంలో పంపిణీ చేసిన 21 వేల ఇళ్ల పట్టాల పంపిణీపై అధికార పార్టీ అభ్యర్థి ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన నవరత్నాల పథకాలే తమను ఎన్నికలలో గెలిపిస్తాయని వైసిపి అభ్యర్థి బాలినేని శ్రీనివాస రెడ్డి భావిస్తున్నారు. అధికార పార్టీ వైసిపికి ప్రజలలో వచ్చిన వ్యతిరేకత, గత టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తమను గెలిపిస్తాయని టిడిపి అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు భావిస్తున్నారు.

చేరికలు అటూ..ఇటూ..

అధికార వైసిపి, టిడిపిలు నిత్యం చేరికలు ఉంటున్నాయి. కొందరు టిడిపి నుంచి వైసిపిలోకి, మరికొందరు వైసిపి నుంచి టిడిపిలోకి చేరుతున్నారు. పార్టీల్లో చేరేవారిలో కొందరు ఉదయం ఒక పార్టీ కండువా, సాయంత్రం మరో పార్టీ కండువా కప్పుకోవటం గమనార్హం.

కుటుంబ సభ్యుల ప్రచారం

అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి అభ్యర్థుల ప్రచారంలో కుటుంబ సభ్యులు పాల్గొంటున్నారు. వైసిపి అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి తరపున ఆయన భార్య బాలినేని శచీదేవి ప్రచారం చేస్తున్నారు. 'స్త్రీ శక్తి' పేరుతో ఆమె ప్రచారం నిర్వహిస్తున్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు బాలినేని కావ్య సైతం తమ మామను మళ్లీ గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. టిడిపి అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు కుటుంబ సభ్యులు సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. నారీ కోసం నాగసత్యలతమ్మ కార్యక్రమంలో దామచర్ల జనార్ధనరావు సతీమణి దామచర్ల నాగసత్యలత మహిళా ఓటర్లను కలుస్తున్నారు. దామచర్ల జనార్ధనరావు ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఆయా డివిజన్‌లలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తారని హామీలు ఇస్తున్నారు. దామచర్ల జనార్ధనరావు కుమార్తెలు అనీషా లక్ష్మి, తనూజ లక్ష్మి సైతం ప్రచారంలో తమ తండ్రి గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలు నియోజకవర్గ ఓటరు ఎవరిని అందలమెక్కిస్తారో వేచిచూడాల్సిందే.